సాక్షి వైఎస్ఆర్ జిల్లా

సోమవారం : 14 : ఆగస్టు : 2023



దశ 'దిశ'లా రక్షణ!
బాధిత మహిళలు, చిన్నారులకు దిశ పోలీస్ స్టేషన్‌లు దశదిశలా రక్షణ కల్పిస్తున్నాయి. అలాగే దంపతుల మధ్య గొడవలు వస్తే కౌన్సెలింగ్ ఇస్తూ కలిపేస్తున్నాయి. - 8లో



వైభవంగా ముత్తుమారెమ్మ జాతర
ముత్తుమారెమ్మ జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. నందలూరు మండలం అరవపల్లెలో కొలువైన ముత్తుమారెమ్మకు వైఎస్సార్, అన్నమయ్యజిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 33.2 /24.9
జిల్లాలో ఆదివారం 24.9 - 33.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

కాచిగూడ-విల్లుపురం మధ్య ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కాచిగూడ-విల్లుపురం-కాచిగూడ (07424/25) మధ్య ప్రత్యేక రైలును నడపనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ రైలు 14, 15 తేదీల్లో రెండు ట్రిప్పులు నడుస్తుందన్నారు. 14వ తేదీ సాయంత్రం 5.45 గంటలకు కాచిగూడలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.05 గంటలకు కడపకు వస్తుంది. మధ్యాహ్నం 1.30 గంటలకు విల్లుపురం చేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఈనెల 15న సాయంత్రం 4.50 గంటలకు విల్లుపురంలో బయలుదేరి అర్ధరాత్రి 12.28 గంటలకు కడపకు చేరుకుని 16వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు కాచిగూడ వెళుతుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నందలూరు వాసి కొర్లకుంట సుప్రజకు పురస్కారం

సుప్రజ

రాజంపేట : నందలూరు గ్రామానికి చెందిన కొర్లకుంట సుప్రజకు కేంద్ర హోంశాఖ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ విషయాన్ని నందలూరు సౌమ్యనాథాలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి ఆదివారం ఇక్కడి విలేకర్లకు తెలిపారు. 2023 సంవత్సరానికి గాను దేశంలో 140 మంది పోలీసులకు కేంద్రహోంశాఖ అవార్డులను ఇవ్వనుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌నుంచి కేంద్ర మెడల్‌కు ఎంపికైన ఐదుమందిలో సుప్రజ ఒకరు కావడం గర్వకారణమన్నారు. ప్రస్తుతం ఈమె గుంటూరు రూరల్ ఎఎస్పీగా పనిచేస్తున్నారన్నారు. నందలూరు గ్రామానికి చెందిన కొర్లకుంట సుబ్బయ్య, లత దంపతుల రెండవకుమార్తె సుప్రజ.

ఏపీజీఈఎఫ్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా మేసా ప్రసాద్



ఏపీజీఈఎఫ్ రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డితో మేసా ప్రసాద్

కడప రూరల్ : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా మేసా ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కాగా, శనివారం రాత్రి గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగిన కార్యవర్గ ఎన్నికలో రాష్ట్ర చైర్మన్‌గా కాకర్ల వెంకటరామిరెడ్డితోపాటు జిల్లాకు చెందిన మేసా ప్రసాద్ తదితరులు ఎన్నిక కావడంపై మెడికల్ అండ్ హెల్త్ (వైఎస్సార్ టీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు వీఎస్ మునిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.చంద్రమోహన్, నాయకులు వలీబాష, నాగరాజు, మహదేవ్‌యాదవ్, ఆంజనేయప్రసాద్, ఖాదర్ బాష తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

జోరుగా పింఛా నిర్మాణ పనులు



పింఛా నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట : పింఛా డ్యాంను రూ.84 కోట్ల వ్యయంతో పునరుద్ధరణ చేస్తున్నామని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం డ్యాంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కిందట కురిసిన భారీవర్షాలు, వరద ఉధృతికి వల్ల పింఛా డ్యాం తెగిపోయిందన్నారు. పింఛా డ్యాంను మళ్లీ పునః నిర్మాణం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కోరామన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి రూ.84.33 కోట్ల నిధులను మంజూరు చేశారని గుర్తుచేశారు. పనులను కూడ టెండర్లను దక్కించుకున్న సంస్థ చేపట్టిందన్నారు. స్పిల్‌వే పనులు నెలలోపు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి పింఛా పర్యటన ఉంటుందన్నారు. ప్రజలకు సాగునీరు, తాగునీరు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించామన్నారు. పూర్తి నాణ్యతతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టరును ఆదేశించామన్నారు. రాబోయే వర్షాకాలంలోపు వీలైనంతవరకు నిర్మాణ పనులు పూర్తికావాలన్నారు. ఎమ్మెల్యే వెంట జడ్పీటీసీ ఇస్మాయిల్, నాయకులు రామస్వామిరెడ్డి, వెంకటరమణారెడ్డి, రహీంబాష, కృష్ణారెడ్డి, సర్పంచి నాగేంద్ర, ఈశ్వరరెడ్డి, చింటూ, గుండ్లపల్లి బాబు, శివారెడ్డి, కృష్ణారెడ్డి, పింఛా డ్యాం అధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీకి.. మా ఊరి బొప్పాయి



బొప్పాయి సీజన్ మొదలైంది. ఒకట్రెండు కాదు సుమారు ఆరునెలల పాటు సాగే సీజన్ కావడంతో తోటల్లో సందడి మొదలైంది. ఇటు రైతుల్లో.. అటు వ్యాపారుల్లో బొప్పాయి మాటే.. రేటే వినిపిస్తోంది. ఇక దేశ రాజధాని ఢిల్లీకి తరలించే బొప్పాయి ప్యాకింగ్ మరింత స్పెషల్‌గా ఉంటుంది. మరి అన్నమయ్య బొప్పాయి గొప్పలేంటో చూద్దామా.. అదే అదే చదివేద్దామా!



చెట్టు నుంచి జాగ్రత్తగా కాయను దించుతున్న కూలీ



ఎగుమతికి అవసరమైన కాయల్ని కోసి ప్రత్యేకంగా పేపర్లో చుడుతున్న కూలీలు



లారీ లోపల నలువైపులా ఎండుగడ్డి నింపి బొప్పాయిని లోడింగ్ చేసిన దృశ్యం

ఒక ఎకరాలో పంట కాపు	30-40 టన్నులు..
కోత వ్యవధి కాలం	15 రోజులు
ఒక కోతకు వచ్చే కాయలు టన్నుల్లో	3
ఒక లారీకి చేసే లోడింగ్	15-17 టన్నులు..
జిల్లా నుంచి ప్రతి రోజు ఎగుమతి అయ్యే కాయలు	35-40 టన్నులు..
సీజన్‌లో జరిగే వ్యాపారం	70-80 రూ.. కోట్లలో

బొప్పాయి అ'ధర'హో!
- రోజూ టన్నుల సంఖ్యలో ఎగుమతి
- సిద్ధహస్తులైన కూలీలతో లోడింగ్
- మార్కెట్లో కిలో ధర రూ.26

గుర్రంకొండ : అన్నమయ్య జిల్లాలో పడమటి ప్రాంతాలైన పీలేరు,మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల పరిధిలో సాగు చేసిన బొప్పాయికి మంచి రోజులొచ్చాయి. ఇక్కడి బొప్పాయికి ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. సీజన్‌లో వ్యాపారులే తోటల దగ్గరికొచ్చి కాయలను కొనుగోలు చేస్తుంటారు. ఫలితంగా ఇక్కడి రైతులు కూడా ఎక్కువ విస్తీర్ణంలో బొప్పాయి తోటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల పరిధిలో సుమారు 876 హెక్టార్లలో పంట సాగులో ఉన్నట్లు అంచనా. ఇక ప్రస్తుతం మార్కెట్లో కిలో బొప్పాయి ధర రూ.26 వరకు పలుకుతోంది. దీంతో ఢిల్లీ, ముంబై, రాజస్థాన్‌కు చెందిన బొప్పాయి వ్యాపారులు ఇక్కడే మకాం వేసి బొప్పాయిని తోటల వద్దే కొనుగోలు చేసి వారి రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

ఆరునెలల పాటు ఇక్కడే మకాం

బొప్పాయి ఎగుమతులు చేయడం కోసం వ్యాపారులు, ఏజెంట్లు సుమారు ఆరునెలల పాటు ఈ ప్రాంతంలో మకాం వేస్తారు. ముంబై , రాజస్థాన్‌కు తరలించే బొప్పాయిల కంటే దేశరాజధాని ఢిల్లీకి ఎగుమతి చేసే కాయల కటింగ్ కొంచెం ఆసక్తికరంగా ఉంటుంది. ఈ కాయల కటింగ్, ప్యాకింగ్ కోసం బీహార్,జార్ఖండ్ రాష్ట్రాల నుంచి సిద్ధహస్తులైన కూలీలను వ్యాపారులు ఇక్కడికి తీసుకొస్తుంటారు. ముందుగా ఎండుగడ్డితో లారీని లోపలంతా ఒక క్రమపద్ధతిలో ప్యాకింగ్ చేస్తారు. సాధారణంగా మన ప్రాంతంలో బొప్పాయి సగం రంగు వచ్చే వరకు కోత కోయరు. అయితే ఢిల్లీ కటింగ్‌లో తేడా ఉంటుంది. కటింగ్ కాయలు పచ్చిగా ఉండాలి, వారం రోజుల తరువాత వర్షం వచ్చే కాయలనే తోటల్లో ఏరిమరీ కోస్తుంటారు. పైగా ఒక్క కాయ కూడా కింద పడకుండా చెట్టు నుంచే జాగ్రత్తగా కిందికి దించుతారు. ఇక్కడి నుంచి ఢిల్లీకి లోడ్ లారీ చేరుకోవాలంటే కనీసం ఆరురోజుల సమయం పడుతుంది. అప్పటి వరకు కాయలు చెడిపోకుండా బందోబస్తు చేయడం కూలీల ప్రత్యేకత. ఈ సీజన్‌లో వందలాది మంది కూలీలు బయట రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి ఉపాధి పొందుతుండడం విశేషం.

ఢిల్లీలో భలే డిమాండ్

ఢిల్లీలో ఇక్కడి బొప్పాయికి మంచి డిమాండ్ ఉంటోంది. ఉత్తరాది రాష్ట్రాల్లో ఈ ఏడాది వర్షాలకు బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయి. దీంతో ఇక్కడి బొప్పాయికి మంచి డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం ఇక్కడి మార్కెట్లో కిలో రూ.26వరకు ధరలు పలుకుతోంది. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, రాజస్థాన్ మార్కెట్లలో కిలో రూ.80 నుంచి రూ.100 వరకు ధరలు పలుకుతుండడం గమనార్హం. అక్కడ బొప్పాయిని ఎక్కువగా బేకరీ ఐటం, హల్వా తయారీలో ఎక్కువగా వినియోగిస్తారని వ్యాపారులు తెలిపారు.

ఈ ఏడాదిలో ఇవే అత్యధిక ధరలు..

నిన్నామొన్నటి వరకు బొప్పాయికి సరైన ధరలు లేక రైతులు డీలా పడ్డారు. ప్రస్తుతం బొప్పాయి ధరలు మార్కెట్లో బాగా పుంజుకొన్నాయి. పదిరోజుల కిందట కిలో బొప్పాయి ధర రూ. 12 నుంచి 15 వరకు మాత్రమే పలికాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో బొప్పాయి ధర రూ.26 వరకు పలుకుతుండడం విశేషం. ఈఏడాదిలో బొప్పాయి ఇవే అత్యధిక ధరలు అని రైతులు అంటున్నారు. మార్కెట్లో ధరలు ఇలాగే నిలకడగా ఉంటే లాభాల పంట పండినట్లేనని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



తోటల వద్దే కొనుగోలు చేస్తున్నారు

బొప్పాయి తోటల వద్దకే వ్యాపారులు వచ్చి కాయల్ని కొనుగోలు చేస్తున్నారు. బయట రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ముందుగానే సంప్రదించి ధర నిర్ణయిస్తారు. ఢిల్లీకి తరలించే బొప్పాయిని జాగ్రత్తగా నైపుణ్యం కలిగిన కూలీల చేత కోయిస్తారు. వాటిని భద్రంగా ప్యాకింగ్ చేసి వాహనాల్లో లోడ్ చేసి తీసుకెళుతుంటారు. చెట్టు నుంచి కాయల్ని కింద పడనీయకుండా కోసి తరలిస్తుంటారు.

– సుధాకర్ రెడ్డి, బొప్పాయి రైతు, చెరవుమొరవపల్లె

ఐదు ఎకరాల్లో సాగు చేశా

ఈసీజన్‌లో నేను ఐదు ఎకరాల్లో బొప్పాయి సాగు చేశాను. ప్రస్తుతం తోటల వద్దకే వచ్చి వ్యాపారులు కిలో రూ.26 చొప్పున ధర ఇస్తున్నారు. కూలీ ఖర్చు, మార్కెట్‌కు తరలించడం వంటి అన్ని ఖర్చులు వ్యాపారులే భరిస్తారు. ప్రస్తుతానికి మంచి గిట్టుబాటు ధరలే ఉన్నాయి. ఇవే ధరలు నిలకడ ఉంటే లాభాలు చూడవచ్చు.

– నరసింహారెడ్డి, బొప్పాయి రైతు, ఎగువతొట్టివారిపల్లె

26 నుంచి ఆంధ్రా ప్రీమియర్ లీగ్



3కే రన్‌లో పాల్గొన్న క్రికెట్ సంఘం ప్రతినిధులు, క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : ఆంధ్రా ప్రీమియర్ లీగ్ నిర్వహణతో క్రీడాకారులకు చక్కటి అవకాశాలు లభిస్తున్నాయని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ పేర్కొన్నారు. 'ఆంధ్ర ప్రీమియర్ లీగ్'(ఏపీఎల్) సీజన్-2 ఈనెల 26 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో 'మన ఆంధ్ర.. మన ఏపీఎల్'పేరుతో 3కే రన్ నిర్వహించారు. కడపలోని డీఎస్ఏ క్రీడామైదానం నుంచి కోటిరెడ్డి సర్కిల్ వరకు రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో నిర్వహిస్తున్న ఈ మ్యాచ్‌లను లైవ్ ద్వారా వీక్షించవచ్చని చెప్పారు. పూర్వపు కార్యదర్శి పి. సంజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి టోర్నమెంట్‌లు స్థానిక క్రీడాకారులకు చక్కటి అవకాశాలను కల్పిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ ఎం. సాయిపృథ్వితేజ్, ఉమన్ క్రికెట్ కోఆర్డినేటర్ కె. విష్ణుమోహన్‌రావు, సభ్యులు ఎల్. మునికుమార్‌రెడ్డి, శ్రీనివాస్, కోస్టల్ రైడర్స్ టీం కోచ్, మాజీ ఐపీఎల్ క్రీడాకారుడు పైడికాల్వ విజయ్‌కుమార్, అబుబకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.



• త్రివర్ణ శోభితం

ఆజాదీ కా అమృత మహోత్సవం వేళ గండికోట జుమ్మా మసీదు ప్రాంగణం త్రివర్ణ శోభితమై మెరిసింది. పర్యాటక ప్రాంతమైన గండికోట ప్రాంతంలోని జుమ్మా మసీదు, కోట ఆవరణలో ఉన్న అన్ని ప్రాంతాలను ఆర్కియాలజి అధికారులు విద్యుత్ దీప కాంతులతో ముస్తాబు చేశారు. దీంతో గ్రామంలో సందడి నెలకొంది. ఇక ఆదివారం పర్యాటకులు భారీ ఎత్తున వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. - జమ్మలమడుగు రూరల్

సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మెన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి



హాజరైన అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

- ఉద్యోగులు, ప్రజలు ప్రభుత్వానికి రెండు కళ్లు
- ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర స్థాయి సర్వ సభ్య సమావేశంలో జెడ్పీ చైర్మెన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : గ్రామీణ ప్రాంత ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సేవలందిస్తోందని జిల్లా పరిషత్తు చైర్మెన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం కడప జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశానికి ఏపీ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, వైస్ చైర్మెన్ నాగిరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీ చైర్మెన్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఉద్యోగులకు సానుకూల ప్రభుత్వమన్నారు. కొంతమంది సరిపోని వారు పనిగట్టుకొని ప్రభుత్వంపై వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగులు, ప్రజలు ప్రభుత్వానికి రెండు కళ్లు అన్నారు. ఉద్యోగులంతా బాగా పనిచేసి ప్రభుత్వ ప్రతిష్టను పెంచాలన్నారు. త్వరలో జిల్లాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వస్తారని ఆయన దృష్టికి మీ సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే 13 జిల్లాల చైర్మెన్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం నేతృత్వంలో వినూత్నంగా సచివాలయ వ్యవస్థ ఏర్పాటై అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతోందన్నారు. నాడు – నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేశారని కానీ పాఠశాలల్లో పనిచేసే రికార్డు, లైబ్రరీ అసిస్టెంట్ల పురోగతి లేదన్నారు. అలాగే నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం కల్పించుకోవాలన్నారు. జెడ్పీ వైస్ చైర్మెన్ బాలయ్య మాట్లాడుతూ త్వరలో మీ సమస్యలన్నింటిని మా చైర్మెన్‌ల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రియల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలో సంఘ సమావేశాలను నిర్వహించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఏపీ పీఆర్ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లంకా మల్లేశ్వరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బసివిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు సోమశేఖర్, శివకుమార్‌రెడ్డి కృష్ణశర్మ, నారాయణరెడ్డి, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాసులరెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు, అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు.

పెళ్లి సందడికి వేళాయెె

శుభ ముహూర్తాలకు వేళయింది. శ్రావణమాసం.. వరుస ముహూర్తాలు వస్తుండడంతో జిల్లాలో మళ్లీ పెళ్లి సందడి ప్రారంభం కానుంది. ఈ నెల 19 నుంచి డిసెంబర్ వరకు సుమారు 50కి పైగా ముహూర్తాలు వస్తుండడం విశేషం. ఫలితంగా జిల్లాలో పెళ్లిళ్లతో.. పందిళ్లు సందడిగా మారనున్నాయి.

- 17 నుంచి శ్రావణమాసం
- 19 నుంచి వరుస ముహూర్తాలు
- వివాహాలకు ముమ్మరంగా ఏర్పాట్లు



కడప కల్చరల్ : ఏప్రిల్‌లో శుభ కార్యాలకు ముహూర్తాలు లేకపోవడం, జూన్‌లో కొన్ని మాత్రమే ఉండడం, జులైలో ఆషాఢమాసం, అధిక శ్రావణం కారణంగా ముహూర్తాలు లేక ఇన్నాళ్లు శుభ కార్యాలకు బ్రేక్ పడింది. ప్రస్తుతం ఆగస్టు 19 నుంచి ముహూర్తాలు ఉండడంతో తమ పిల్లలకు వివాహాలు చేసేందుకు తల్లిదండ్రులు జోరుగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. డిసెంబరు వరకు వరుసగా ఎక్కువ ముహూర్తాలు ఉండడంతో దాదాపు వెయ్యికి పైగా వివాహాలు జరిగే అవకాశం ఉందని ఆయా వర్గాల ప్రతినిధులు తెలుపుతున్నారు. ఆగస్టు 16న అమావాస్య అనంతరం నిజ శ్రావణమాసం వస్తుండడంతో 19వ తేదీ నుంచి దాదాపు 10 రోజులపాటు వరుసగా వివాహ ముహూర్తాలు ఉన్నాయి. ఇవి డిసెంబరు వరకు కొనసాగనున్నాయి జిల్లాలో ఈ సంవత్సరాంతం వరకు ఉన్న 50కి పైగా ముహూర్తాల్లో వెయ్యికి పైగా వివాహాలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 800కు పైగా పెద్ద కల్యాణ మండపాలు, 1200కు పైగా మీడియం మండపాలు, 1000కి పైగా చిన్న మండపాలు ఉన్నాయి. వీటికి రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షలు అద్దె చెల్లించాల్సి ఉంది. వివాహ ముహూర్తాలు ప్రారంభమయ్యే నాటికి దాదాపు అన్ని కల్యాణ మండపాలు, ముహూర్తాలుగల అన్ని రోజుల్లోనూ ముందే రిజర్వు అయి ఉండడం విశేషం. డిసెంబరు వరకు ఉన్న ఈ సీజన్‌లో వివాహాల కోసం కనీసం రూ. 15-25 కోట్లవరకు ఖర్చవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ సీజన్‌కు ముందు వివాహాలు చేయలేకపోయిన తల్లిదండ్రులకు ఇప్పుడు మంచి ముహూర్తాలు ఆహ్వానం పలుకుతున్నా... పెరిగిన ధరలు దడ పుట్టిస్తున్నాయి.

విందు భోజనాలు

రెండు, మూడు నెలల క్రితం నాటికి విందు భోజనాలు ప్లేటు రూ. 150-180 వరకు ఉండగా, ప్రస్తుతం ఆ ధర రూ. 200-250కి పైగా చేరింది. దీంతో ఘనంగా వివాహాలు నిర్వహించుకోవాలని భావించిన తల్లిదండ్రులకు ధరల దడ పట్టుకుంది. రెండు నెలల క్రితం నాటి ధరలతో పోలిస్తే ఇటీవల కూరగాయల ధరలు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగాయి. అయినా జీవితంలో ఒక్కసారే నిర్వహించే అపురూపమైన ఘట్టం గనుక వివాహాలను ఘనంగానే నిర్వహించేందుకు పెద్దలు సిద్ధమవుతున్నారు. వస్త్రాల ధర కూడా 20-40 శాతం పెరిగింది. శ్రావణమాసంతో పండుగల సీజన్ ప్రారంభమైంది గనుక డిమాండ్ పెరిగి ఎక్కువ మొత్తాలు చెల్లించాల్సి వస్తోంది.

వివాహ ముహూర్తాలు

ఆగస్టులో 8, సెప్టెంబరులో 6, అక్టోబరులో 10, నవంబరులో 14, డిసెంబరులో 14

జిల్లా వ్యాప్తంగా కల్యాణ మండపాలు

పెద్దవి	800
మీడియం	1200
చిన్నవి	1000కి పైగా
జరగనున్న వివాహాలు	1000
మొత్తం ఖర్చు	రూ. 25కోట్లు

క్లుప్తంగా

అభాగ్యురాలికి ఆశ్రయం



వృద్ధురాలి వివరాలు తెలుసుకుంటున్న టూటౌన్ సీఐ హాసింబాషా

కడప రూరల్ : ఎట్టకేలకు అభాగ్యురాలికి ఆశ్రయం లభించింది. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన వృద్ధురాలు వెంకటసుబ్బమ్మ అనారోగ్యంతో కడప పెద్దదర్గా సమీపంలో అచేతనంగా ఉండిపోయింది. ఈ విషయాన్ని సాక్షి దినపత్రికలో ఆదివారం 'అభాగ్యురాలిని ఆదుకోవాలి' అనే శీర్షికన వార్తను ప్రచురించితమైంది. ఈ వార్తకు ఆ ప్రాంత టూటౌన్ సీఐ హాసిం బాషా స్పందించారు. వెంకటసుబ్బమ్మ దగ్గరికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం వేంపల్లెలోని అనాథాశ్రమ నిర్వాహకులకు ఫోన్ చేసి వృద్ధురాలిని తీసుకెళ్లి ఆశ్రయం కల్పించాలని సూచించారు. దీనికి వారు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో జేకే వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులు

ప్రొద్దుటూరు : స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మదూరు వెంకటరమణ అనే వ్యక్తి చనిపోయాడు. అతనికి బంధువులు ఎవరూ లేకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణరావుకు సమాచారం ఇచ్చారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెంకటరమణ మృతదేహానికి హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేశారు. అలాగే పట్టణంలోని గరుడాద్రినగర్‌లో నివసిస్తున్న డి.మనోహర్ చనిపోగా ఆయన అంత్యక్రియలను ఈ ఫౌండేషన్ వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్‌రావు, సీఈఓ మల్లికార్జున, శివసాయినాథ్, సాయి పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి..

అట్లూరు : అట్లూరు అటవీ చెక్‌పోస్టు సమీపాన బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పోరుమామిళ్ల మండలం తిరువెంగళాపురం గ్రామానికి చెందిన వై.రమేష్ నందలూరు బీసీ హాస్టల్‌లో వంట పని చేస్తున్నాడు. ఆదివారం ఆయన భార్య పురిటి నొప్పులతో పోరుమామిళ్లలోని ఆస్పత్రిలో ఉందని కుటుంబీకులు తెలపడంతో ద్విచక్రవాహనంపై నందలూరు నుంచి బయలుదేరాడు. అట్లూరు అటవీ చెక్‌పోస్టు సమీపానికి రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడి గాయాల పాలయ్యాడు. బాధితుడిని స్థానికులు 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

దశ 'దిశ'లా రక్షణ

- మహిళలు, చిన్నారుల సమస్యలు, నేరాలకు చెక్
- 'దిశ'యాప్ ద్వారా నమోదైన కేసులు
- భార్యాభర్తల మనస్పర్థలను దూరం చేస్తున్న 'కౌన్సెలింగ్'



కడప 'దిశ' పోలీస్‌స్టేషన్

కడప అర్బన్ : దిశ పోలీస్‌స్టేషన్‌లు మహిళలు, చిన్నారులకు దశ'దిశ'లా రక్షణ కల్పిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, చిన్నారుల పట్ల నేరాల నియంత్రణ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'దిశ' పోలీస్ స్టేషన్‌లను 2020 ఫిబ్రవరి 7న ప్రారంభింపచేశారు. కడపలో అదే రోజున రాష్ట్ర డిప్యూటీ సీఎం ఎస్.బి.అంజద్‌బాషా జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో కడప 'దిశ' పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ప్రారంభ సమయంలో డీఎస్పీ, సీఐ, నలుగురు ఎస్‌ఐలు, ఇద్దరు ఏఎస్‌ఐలు, ఏడుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, ఆరుగురు కానిస్టేబుళ్లు విధుల్లో చేరారు. తరువాత ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆరుగురు పని చేస్తున్నారు. తరువాత క్రమంలో ప్రస్తుతం డీఎస్పీ, సీఐ, ఐదుగురు ఎస్‌ఐలు, ముగ్గురు ఏఎస్‌ఐలు, ఐదుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 21 మంది కానిస్టేబుళ్లు విధులను నిర్వహించాలని పోస్టులను కడప 'దిశ'కు మంజూరు చేశారు. ఈ మేరకు సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమిస్తే మరింత ప్రయోజనం చేకూరుతుంది.

'దిశ' పోలీస్‌స్టేషన్ ద్వారా అందిస్తున్న సేవలు

- జిల్లా వ్యాప్తంగా మహిళా సంరక్షణ కార్యదర్శులు (మహిళా పోలీస్) ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో విధులను, పనితీరును, నేరాల నియంత్రణను ప్రతి రోజూ దిశ డీఎస్పీ ద్వారా 'దిశ టాస్క్ ట్రాకర్' ద్వారా తెలుసుకుంటున్నారు.
- జిల్లాలో మహిళలు, చిన్నారుల నేరాల నియంత్రణ కోసం 'దిశ'యాప్‌ను 16 లక్షల మేరకు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 'దిశ' యాప్ రిజిస్ట్రేషన్‌లను 5,02,981 మంది చేసుకున్నారు.
- భార్యాభర్తల మధ్య మనస్పర్థలను 'కౌన్సెలింగ్' ద్వారా దూరం చేసేందుకు కడపలో 'దిశ' పోలీస్ స్టేషన్‌కు నేరుగా గానీ, ట్రిపుల్ సీ ద్వారా గానీ వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు.
- కడప 'దిశ' పోలీస్‌స్టేషన్‌లో 2021లో 1195 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని పరిష్కరించారు. 2022లో 1369 ఫిర్యాదులను పరిష్కరించారు. 2023లో జూలై చివరి వరకు 700 ఫిర్యాదులు రాగా వాటిల్లో 698 ఫిర్యాదులను పరిష్కరించారు.
- జిల్లాలో మహిళలు, చిన్నారుల అదృశ్యం కేసులను కూడా పరిష్కరిస్తున్నారు. జిల్లాలో 277 మిస్సింగ్ కేసులు ఈ ఏడాది నమోదు కాగా, వాటిలో 265 కేసులను ఛేదించారు. ఇంకా 13 కేసులను పరిష్కరించాల్సి వుంది.
- ప్రతి మంగళ, శనివారాల్లో కడప 'దిశ' పోలీస్‌స్టేషన్‌లో భార్యాభర్తల మనస్పర్థలను దూరం చేసేందుకు గాను, పోలీసు సిబ్బందితోపాటు, ఒన్‌స్టాప్ (సఖి) సెంటర్ ద్వారా సిబ్బంది వచ్చి 'కౌన్సెలింగ్'ను నిర్వహిస్తారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా భార్యాభర్తలు కలవకపోతే చట్టపరిధిలో కేసులను నమోదు చేసుకోవడం, కోర్టు ద్వారా వారికి పరిష్కార మార్గాలను సూచిస్తారు.
- కడపకు చెందిన ఓ జంటకు 'దిశ' పోలీస్‌స్టేషన్‌లో రెండు సార్లు కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. భర్త తన తల్లికి వచ్చే పింఛన్ మీద ఆధారపడి, భార్యను మాటలతో వేధించేవాడు. ఇద్దరు పిల్లలు సంతానం కలిగారు. వారిని దృష్టిలో పెట్టుకుని, భార్యను సక్రమంగా చూసుకోవాలని 'కౌన్సెలింగ్' నిర్వహించి కలిపేందుకు కృషి చేసి, విజయవంతం చేశారు.

మహిళల సమస్యల పరిష్కారానికి కృషి



కడప 'దిశ' పోలీస్‌స్టేషన్ ద్వారా మహిళలు, చిన్నారుల సమస్యలను పరిష్కరించేందుకు అందరి సహకారంతో కృషి చేస్తున్నాం. 'దిశ' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాం. మహిళలు, చిన్నారుల అదృశ్యం కేసులను పరిష్కరించాం. ఎవరైనా నిర్భయంగా ఫిర్యాదు చేసేందుకు రావచ్చును.

– ఎస్.రమాకాంత్, కడప 'దిశ' డీఎస్పీ



భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారుల బృందం

జిల్లాలో 'దిశ'యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వివరాలు

సంవత్సరం	ఎఫ్ఐఆర్	పరిష్కరించినవి	మొత్తం	రిజిస్ట్రేషన్‌లు
2020	5	21	26	-
2021	27	265	292	2,11,618
2022	40	793	833	2,77,144
2023	13	170	183	14,219
మొత్తం	85	1249	1334	5,02,981

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : చోరీ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైలవరం మండలం తలమంచిపట్నం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గతేడాది డిసెంబరు 12న హుండీ పగులగొట్టి రూ.5 వేల నగదు తీసుకెళ్లారు. ఈ సంఘటనలో కర్నూలు జిల్లాకు చెందిన బోయ హరిక్రిష్ణ, పుల్లయ్యను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గోపినాథ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. అలాగే తాళ్ల ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, వల్లూరు తదితర ప్రాంతాల్లో ఒక వెండి కిరీటం, కొంత మేరకు బంగారు చోరీ చేసినట్లు పోలీసుల విచారణలో నిందితులు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

ముద్దనూరు : స్థానిక రైల్వేస్టేషన్‌లో ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని కుళ్ళాయమ్మ(50)అనే మహిళ ఆదివారం దుర్మరణం చెందింది. ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ రారాజు సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేంపల్లె మండలం కుప్పలపల్లె గ్రామానికి చెందిన కుళ్ళాయమ్మ ముద్దనూరులో 2వ ప్లాట్‌ఫాంలో రైలు దిగి 1వ ప్లాట్‌ఫాంలోకి ట్రాక్‌పై నడిచి వస్తోంది. అదే సమయంలో వచ్చిన రైలు ఢీకొంది. ఆమె తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏటీఎం మోసగాడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్ కుమార్

కలికిరి : ఏటీఎం కేంద్రాలకు వచ్చే అమాయకులే అతని టార్గెట్.. వారికి సాయం చేస్తున్నట్లు నమ్మిస్తాడు. వారిని ఏమార్చి ఏటీఎం కార్డు మార్చి ఇచ్చి నగదు కొల్లగొట్టడమే పనిగా పెట్టుకున్నాడు. ఎట్టకేలకు పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వాల్మీకిపురం సీఐ సురేష్‌కుమార్ ఆదివారం నిందితుడిని మీడియా ఎదుట హాజరు పరిచి, వివరాలు వెల్లడించారు. చిత్తూరు జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గం సదుం మండలం ఊటుపల్లి గ్రామం బత్తలవారిపల్లికి చెందిన చింతల మోహన్ చిన్నతనం నుంచి జల్సాలకు అలవాటు పడ్డాడు. ఇందుకు సునాయాసంగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఇందుకు ఏటీఎం కేంద్రాలను అడ్డాగా మార్చుకున్నాడు. గత నెల 29, 30 తేదీలలో కలికిరి క్రాస్ రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం వద్ద కాపు కాచి ఐదుగురుని మోసగించి వారి ఏటీఎం కార్డులు కొట్టేశాడు. వారి అకౌంట్‌లలోని రూ.2 లక్షలు డ్రా చేసుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శనివారం సాయంత్రం కలికిరి పట్టణం కలకడ రోడ్డులోని సాయిబాలాజీ నగర్‌లో నిందితున్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారణ చేశారు. ఇలాంటి ఏటీఎం కేంద్రాల వద్ద మోసాలకు పాల్పడి గుజరాత్ రాష్ట్రంలో సైతం జైలు శిక్ష అనుభవించినట్లు, కలికిరి క్రాస్ రోడ్డులో అతి వేగంతో ఆటో నడిపి వ్యక్తి మృతికి కారణమై జైలు శిక్ష అనుభవించినట్లు తెలిపాడు. నిందితుని వద్ద నుంచి రూ.42 వేల నగదు, ఏటీఎం కార్డు, మొబైల్, వెండి చైన్, బ్రాస్‌లైట్, ఉంగరం, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.రహీముల్లా, ఏఎస్ఐ మధుసూదనాచారి, హెచ్‌సీలు మనోహర్, మదన్‌మోహన్‌రెడ్డి, మహ్మద్ అలీ, పీసీలు మునిరత్నం, అమర్‌నాథ్, చైతన్య, హోంగార్డులు పాల్గొన్నారు.

పొట్టేళ్ల పెంపకంలో అర్జున్ విజయం

- ఫారమ్‌తో రాణిస్తున్న యువరైతు
- అధునాతన పద్ధతి అవలంబిస్తూ..
- అనతి కాలంలోనే అధిక లాభార్జన



అర్జున్‌రెడ్డి ఏర్పాటు చేసిన పొట్టేళ్ల షెడ్డు



షెడ్డులో విడి విడిగా ఉన్న పొట్టేళ్లు

పీలేరు : గ్రామీణ జీవన విధానంలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తూ.. వారి జీవన ప్రమాణాలను పెంచడంలో పొట్టేళ్ల పెంపకం ప్రముఖ పాత్ర పోషిస్తోంది. అందుకు అనుగుణంగా యువ రైతులు పొట్టేళ్ల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. కొన్నేళ్లుగా గొర్రెల పెంపకం కులవృత్తిగా భావించే వారు కూడా ఆసక్తి తగ్గిస్తూ వచ్చారు. అయితే ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులతో వ్యవసాయం ఒక్కటే లాభదాయకం కాదు అని గ్రహించిన వారు.. గొర్రెలు, పొట్టేళ్ల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. అందులో భాగంగా పీలేరు మండలం కాకులారం పల్లె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన యువ రైతు అర్జున్‌రెడ్డి ఆధునిక పద్ధతిలో పొట్టేళ్ల ఫారమ్ నెలకొల్పి కాసుల వర్షం కురిపిస్తున్నాడు. పలువురికి ఆదర్శంగా నిలిచాడు.

రూ.20 లక్షలతో ఫారమ్

కొత్తపల్లెకు చెందిన యువ రైతు అర్జున్‌రెడ్డి తన రెండున్నర ఎకరాల వ్యవసాయ పొలంలో పొట్టేళ్ల ఫారమ్ ఏర్పాటు చేశారు. రూ.15 లక్షలతో రెండు అంతస్తుల షెడ్ నిర్మాణం చేపట్టారు. రూ.5 లక్షలతో పొట్టేళ్ల పిల్లలు కొనుగోలు చేశాడు. పొట్టేళ్లకు ఎలాంటి అంటు వ్యాధులు సోకకుండా ఆరోగ్యంగా ఉండేందుకు రెండో అంతస్తులో గాలి, వెలుతురు, నీటి సౌకర్యం ఉండేటట్లు ఆధునిక పద్ధతిలో ఏర్పాటు చేశారు. పొట్టేళ్ల మలమూత్రం కూడా అక్కడ నిల్వ ఉండకుండా ఒక వైపున కింద పడేటట్లు అధునాతన పద్ధతిలో ఏర్పాటు చేశారు.

ఎంపికలో జాగ్రత్తలు

గొర్రె, పొట్టేళ్లను కమర్షియల్‌గా పెంచడానికి మంచి మేలు జాతి ఎంపిక చేయాల్సి ఉంది. అందులో భాగంగా అర్జున్‌రెడ్డి ఈ ప్రాంత వాతావరణానికి అనుగుణంగా నెల్లూరు జొడిపి, నెల్లూరు బ్రౌన్, పల్లా, మాచర్ల బ్రీడ్ రకాలు పెంచుతున్నాడు. ఫారమ్‌లో మొత్తం పది అరలు ఏర్పాటు చేసి, ఒక్కో అరలో పది పొట్టేళ్లు ఉండే విధంగా రూపొందించారు. ఎకరం పొలంలో సూపర్‌నేపియర్, హెడ్స్‌లోషర్న్, ఏఎఫ్ఎస్ 29, జొన్న, పెసర వంటి గ్రాసం పెంచుకుని మిషన్‌తో కత్తిరించి పొట్టేళ్లకు ఆహారంగా అందిస్తున్నారు.

ఏడాదిలో రెండు సార్లు విక్రయాలు



నాలుగైదు నెలల వయసు గల పిల్లలను ఫారమ్‌కు తెచ్చుకుని పెంచడం జరుగుతోంది. ఒక్కో పొట్టేలు పిల్లను రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నాం. ఆరు నెలలు పెంచి విక్రయించడం ద్వారా రెండింతల ఆదాయం లభిస్తోంది. వ్యాపారులు కూడా ఫారమ్ వద్దకే వచ్చి తీసుకెళుతున్నారు. ఖర్చులు పోనూ మిగులు ఆదాయం లభిస్తోంది.

– అర్జున్‌రెడ్డి, యువరైతు, కొత్తపల్లె

ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది



వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా గొర్రెలు, పొట్టేళ్ళ పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఆసక్తి గల రైతులకు షెడ్ల నిర్మాణానికి, గొర్రెలు, పొట్టేళ్ల కొనుగోలుకు రాయితీతో రుణాలు అందిస్తోంది. ఆధునిక పద్ధతిలో పొట్టేళ్ల ఫారమ్ ఏర్పాటు చేసుకునే రైతులకు కావాల్సిన సూచనలు, సలహాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం.

– శ్రీకాంత్‌రెడ్డి, పశుసంవర్థక శాఖ, ఏడీ, పీలేరు

ముత్తుమారెమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం

- అమ్మవారికి పొంగు బాలు సమర్పించిన మహిళలు
- దర్శించుకున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, ఎంపీపీ మేడా



పొంగుబాలతో క్యూలో ఉన్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో ముత్తుమారెమ్మ

నందలూరు(రాజంపేట) : ముత్తుమారెమ్మ జాతరకు ఆదివారం భక్తజనం పోటెత్తారు. తమిళనాడుతోపాటు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు పొంగు బాలు సమర్పించుకున్నారు. నందలూరు మండలం అరవపల్లెలో కొలువైన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సుందరంగా అలంకరించిన అమ్మవారి ఉత్సవమూర్తికి భక్తులు కాయాకర్పూరం సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూ రద్దీగా కొనసాగింది. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కోర్కెలు తీరిన వారు మొక్కులు చెల్లించారు. స్వర్ణాంధ్ర మదర్‌ల్యాండ్ విక్టరీ స్కౌట్ గ్రూప్ అధ్యక్షుడు వేపగుంట సాంరాజ్ ఆధ్వర్యంలో స్కౌట్స్ భక్తులకు సేవలందించారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

ముత్తుమారెమ్మను జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ గడికోట ఉషా సుబ్బారెడ్డి, నాయకులు గంపా సుధాకర్, గొబ్బిళ్ల త్రినాథ్, అరిగెల సౌమిత్రి, అరిగె హరిబాబు, గీతాల నరసింహారెడ్డి, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ఆనాల మధు, గుండుమల్లి, మధురాజు, ముమ్మడిశెట్టి సుధాకర్, పుత్తాశంకర్, మైనార్టీ నేతలు ఇబ్బు, మహబూబ్‌బాషా తదితరులు ఉన్నారు.

■ ముత్తుమారెమ్మను నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈయనకు నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త వెంకటరమణ మొదలియార్ అమ్మవారి చిత్రపటం బహూకరించి, శాలువాతో సన్మానించారు. ఈయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు నడివీధి సుధాకర్, ఆకేపాటి రమేష్‌రెడ్డి, గుణయాదవ్, మట్టిబాబు, పవన్, ఆకులచలపతి, తుమ్మాదిశివ, గొబ్బిళ్ల రవి, ఆనందివేణు, నాయనపల్లె ఆది, అఖిల్, అక్కివెంకటరమణ, నాగేంద్ర, స్వామి ఏలుమలై, గంగిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, వేపగుంటమోసే, ప్రసాద్ తదితరులు ఉన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



ఎంపీపీ మేడాకు అమ్మవారి ఫొటోను అందజేస్తున్న ఆలయ ధర్మకర్త

మిద్దెపై నుంచి పడి ఇద్దరికి తీవ్ర గాయాలు

మదనపల్లె : మిద్దెపై నుంచి పడి ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం పట్టణంలో జరిగింది. మంజునాథ కాలనీకి చెందిన కె.గురునాథ్(19), పి.ఆనంద్(25) భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం స్థానికంగా ఓ ఇంటిపైన పనులు చేసేందుకు వెళ్లారు. గోడ నిర్మాణం చేస్తుండగా పై నుంచి ఇద్దరూ కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న కారు

చిన్నమండెం : మండల కేంద్రంలో మోటార్‌సైకిల్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో కంచి నాగార్జున అనే వ్యక్తికి గాయాలైనట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాయచోటి-మదనపల్లి మెయిన్ రోడ్డు పక్కన కంచి నాగార్జున తన ద్విచక్రవాహనాన్ని ఆపి, నిలుచొని ఉన్నాడు. మదనపల్లె వైపు నుంచి రాయచోటికి వస్తున్న కారు అతనితోపాటు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ నాగార్జునను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

తహసీల్దార్‌పై టీడీపీ నేత జులుం

పెనగలూరు: పెనగలూరు తహసీల్దార్ శ్రీధర్ రావుపై టీడీపీ నేత, రైల్వేకోడూరు ఇన్‌చార్జి విశ్వనాథ నాయుడు జులుం ప్రదర్శించాడు. నేను తలుచుకుంటే నీ ఉద్యోగం పీకేస్తానని హెచ్చరిక జారీ చేశాడు. మేము అధికారంలోకి రాగానే నీవు ఏమైపోతావోనంటూ తీవ్రంగా హెచ్చరించారు. 20 మంది అనుచరులతో తహసీల్దార్ కార్యాలయంలో రెండు రోజుల క్రితం హంగామా సృష్టించిన విషయం వెలుగులోకి వచ్చింది. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, సవరణకు సంబంధించి అధికారులపై టీడీపీ నేత ఇష్టానుసారంగా మాట్లాడారు. వారి అనుచరులు కూడా ఒక్కొక్కరు ఒక్కోవిధంగా తహసీల్దార్‌ను దూషించారు. దీంతో అతను ఎదురు చెప్పలేక అలాగే కూర్చున్నాడు. బీ కేర్‌ఫుల్ అంటూ తహసీల్దార్‌ను తీవ్ర స్వరంతో విశ్వనాథ నాయుడు హెచ్చరించారు. 25 సంవత్సరాలు రాష్ట్రాన్ని టీడీపీ ఏలిందని, మేము తలుచుకుంటే ఏమైపోతావో తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు. పక్కన ఉన్న అనుచరులు మా రాజకీయ అనుభవం అంత లేదు నీ వయస్సు అంటూ తహసీల్దార్‌ను హేళనగా మాట్లాడారు. ఎన్నికల అధికారి ఇచ్చిన గడువు ప్రకారం ఓటర్ల జాబితా చేయాల్సి ఉన్నా మా పార్టీ నాయకులకు సరియైన సమాచారం నీవు ఎందుకు ఇవ్వలేదు.. నీ అంతు చూసేవరకు నిన్ను వదిలిపెట్టమని వారు హెచ్చరించారు.